క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు.

చలపతిరావుకు సత్కారం



కొడవలూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన వీరి చలపతిరావును పార్టీ నేతలు దేవనబోయిన శివకుమార్, దేవిరెడ్డి సాయిరెడ్డిలు నార్తురాజుపాళెంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు : విడవలూరు జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్యను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నెల్లూరు అపోలో ఆస్పత్రిలో లక్ష్మయ్యకు మెదడు సంబంధిత ఆపరేషన్ జరిగింది. దీంతో ఆయన్ను ప్రసన్న పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రాష్ట్ర డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు నేతలకు జిల్లా పదవులు



నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కోవూరు మండలానికి చెందిన నాయకులకు జిల్లా పదవులు దక్కాయి. వారిలో దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డికి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డికి జిల్లా ఉపాధ్యక్షుడిగా, నలుబోలు సుబ్బారెడ్డికి జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా ఎంపిక చేశారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయిలో ఏపీఎస్‌జీఎం డిప్లొమా గేమ్స్ మీట్ నిర్వహించారు. ఇందులో 400 మీటర్ల పరుగు పందెంలో బి.నంద కిశోర్ రెండో బహుమతి సాధించగా, షేక్.నాయబ్ సుల్తాన్ మూడో బహుమతి గెలుచుకున్నారు. డిస్కస్‌త్రోలో లక్ష్మి మూడో బహుమతి సాధించారు. ఈ మేరకు వారిని శనివారం కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రిన్సిపల్ ప్రకాశ్‌రావు, ఏఓ కోట గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

పూరిళ్ల దగ్ధం

విడవలూరు : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల రెండు పూరి గుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కాలనీలోని శైలజ పూరింట్లో శనివారం మధ్యాహ్నం విద్యుత్ మీటర్ వద్ద నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆమె ఇంటి నుంచి పరుగులు తీసింది. కాగా శైలజ ఇంటి సమీపంలోనే తండ్రి గడ్డం బ్రహ్మయ్య పూరిల్లు కూడా ఉంది. గాలికి మంటలు వ్యాపించి రెండు గుడిసెలు క్షణాల వ్యవధిలోనే కాలిపోయింది. ఇరువురి ఇంట్లో రూ.5 వేల నగదు, గృహోపకరణాలు దగ్ధమైంది. ప్రభుత్వం సాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వరికి తెగుళ్ల పోటు

- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
- పంటపై తగ్గని పొగమంచు ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు



తిక్కవరప్పాడులో మందు పిచికారీ



వరి పంటను కమ్మేసిన పొగమంచు

వెంకటాచలం: విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం.. తగ్గని పొగమంచుతో వరిలో తెగుళ్ల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. మందులు చల్లినా ఏ మాత్రం తగ్గడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు

వెంకటాచలం మండలంలో సుమారు 40 వేల ఎకరాల్లో వరిని రైతులు సాగు చేస్తున్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి, గొలగమూడి, రామదాసుకండ్రిగ, కనుపూరు తదితర గ్రామాల్లో ముందుగా వరినాట్లు వేశారు. ఇవి వేసి నెల దాటిపోయింది. అయితే పైరుపై వారం రోజులుగా పొగమంచు పడుతుండటంతో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించడం సైతం సమస్యకు ఓ కారణమవుతోంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించిన పొలాల్లో తెగుళ్లు లేవని రైతులు చెప్తున్నారు. మంచు ప్రభావం తగ్గకపోవడంతో ఎర్ర మచ్చ, మోము తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

ప్రభావం చూపని మందులు

పంటలను ఆశించిన తెగుళ్లను నియంత్రించేందుకు కొన్ని రసాయన మందులను రైతులు కొనుగోలు చేస్తున్నా, అవి పనిచేయడంలేదు. మండలంలోని అన్నదాతలు స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణాల్లోనే మందులను ఎక్కువ శాతం కొనుగోలు చేసి పంటలపై చల్లిస్తున్నారు. అయితే పురుగు మందులపై సరైన అవగాహన లేని రైతులకు కొందరు ఎరువుల దుకాణాల నిర్వాహకులు స్థానిక కంపెనీలకు చెందిన వాటిని అంటగడుతున్నారు. బ్రాండెడ్ కంపెనీల మందుల్లో మార్జిన్ తక్కువగా ఉండటం, లోకల్ కంపెనీల్లో భారీగా లాభం ఉండటంతో వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని పొలాల్లో చల్లించినా, తెగుళ్లు తగ్గకపోవడంతో మరో రకాన్ని కొనుగోలు చేయాల్సి రావడం అదనపు భారంగా మారుతోంది. ఎరువుల దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని, వీటిపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వరిని సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలి. పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఎర్రమచ్చ, ఉల్లికోడు తదితర తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించడంతో తెగుళ్లు అధికంగా వస్తాయనే విషయాన్ని రైతులు తెలుసుకోవాలి. పంటను తెగుళ్లు ఆశించకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

– హరికరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

డిప్యూటీ డీఈ సమావేశం



సమావేశంలో అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం : పీఎంజీవై పథకం కింద మండలంలో పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ డిప్యూటీ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం మండల కార్యాలయంలో శనివారం జరిగిన గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీహరి, ఏఈ పెంచలయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన శూన్యం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. మొత్తం 13 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. అర్జీలిచ్చి వెళ్లడమే తప్ప అధికారుల ప్రసంగాలను వినేందుకు స్థానికులు ఆసక్తి చూపలేదు. రీసర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూచనలిస్తున్న హుస్సేనమ్మ

పొదలకూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ఉధృతితోనే జ్వరాలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తిలో ఇంటింటి ఫీవర్ సర్వేకు శనివారం హాజరైన ఆమె వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాలువల్లో మురుగు పేరుకుపోయి దోమల లార్వా ఏర్పడిందని చెప్పారు. జ్వరాల తీవ్రత తగ్గాలంటే పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఆదేశించారు. డెంగీ పరీక్షల నిమిత్తం జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి నెల్లూరులోని జీజీహెచ్‌కు పంపామని వివరించారు. మలేరియా ర్యాపిడ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, ఆ జ్వరాల్లేవనే అంశం తేలిందని చెప్పారు. జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు మెడికల్ క్యాంప్‌ను నిర్వహించాలని సూచించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, నరసమ్మ, ఆరోగ్య సహాయకులు మహేంద్ర, పెంచలయ్య, సుశీల పాల్గొన్నారు.

వీఎస్‌యూలో పోస్టర్ల ఆవిష్కరణ



ప్రిన్సిపల్ విజయ, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ ఉదయ్ శంకర్, ప్రోగ్రామ్ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో విద్యార్థులకు ప్రతిభ పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో, దానికి సంబంధించిన పోస్టర్లను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్ రావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలను ఎన్నెస్సెస్ యూనిట్ – 4 ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని అభినందించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత,

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న పద్మావతి



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..

కొడవలూరు : పూర్వ ప్రాథమిక విద్యపై మండలంలోని యల్లాయపాళెం అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలతో రైమ్స్, రోల్ ప్లే ఆడించడంతో పాటు అవ్వాతాతలు, తల్లిదండ్రులకు ప్రీస్కూల్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ ఈసీఈ(ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్) డేలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆట, పాటల ద్వారా విద్య నేర్పించడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. మహిళా పోలీసు మేరీ హెబ్సిబా, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, సుఖవేణి పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..


మండలంలోని నార్తురాజుపాళెం అంగన్‌వాడీ–1 కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో ఈసీఈ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఉపకరణాలను తల్లిదండ్రులకు ప్రదర్శించి చూపడంతో పాటు వాటి ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజమ్మ, సహాయకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: మైపాడులో..

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజ్యలక్ష్మి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు వెంకటరమణమ్మ, మంజుల పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ శనివారం ప్రారంభించారు. పిల్లలకు భోజనం విషయంలో చిన్న తప్పు జరిగినా ఉపేక్షించనని ఆమె తెలిపారు.

ఎన్నారై దాతృత్వం



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న లీలావతమ్మ

తోటపల్లిగూడూరు: మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బసంగారి లాలస చదువులో చక్కటి ప్రతిభ కనబరుస్తోంది. ఈ క్రమంలో బాలిక ప్రతిభను గుర్తించిన స్థానికుడైన ఎన్నారై కాపునూరు విజయ్‌మోహన్‌రెడ్డి రూ.1.25 లక్షల విలువజేసే ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌మోహన్‌రెడ్డి తల్లి లీలావతమ్మ దీన్ని విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా లీలావతమ్మను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. విజయ్‌మోహన్‌రెడ్డి స్నేహితుడు, పాఠశాల గణిత ఉపాధ్యాయుడు మోహన్‌ను అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టాగూర్, ఉపాధ్యాయులు విద్యాధరి, ఫణికుమార్, రమణప్రసాద్, పద్మజ, నళిని, వాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

పూట గడవడమే కష్టంగా ఉన్న ఆ పేద కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. కరోనా సమయంలో ఓ కుమారుడు వ్యాధిన పడి కానిరాని లోకాలకు వెళ్లాడు. తిరిగి అదే అనారోగ్యంతో ఉన్న మరో కొడుకు బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. దీంతో వారికి ఏమి చేయాలో తెలియక దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

- లివర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడు
- వైద్యానికి రూ.30 లక్షలు అవసరం
- సాయం చేయాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులతో వర్షిత్

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం దళితవాడకు చెందిన ఈదూరు మధు– మీనాక్షి దంపతులకు నితీష్, వర్షిత్ అనే ఇద్దరు కుమారులు. కూలి పనులు చేసుకుంటూ ఉన్నదాంట్లో సంతోషంగా ఇద్దరినీ అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. పెద్ద కుమారుడు నితీష్ ఏడేళ్ల వయస్సులో కరోనా సమయంలో అనారోగ్యం పాలయ్యాడు. వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లినా కరోనా కష్టకాలం వల్ల వైద్యశాలల్లో చేర్పించలేకపోయారు. సరైన సమయానికి వైద్యం అందకపోవడంతో తల్లిదండ్రుల చేతుల్లోనే ఆ చిన్నారి ప్రాణాలు విడిచాడు. ఆ బాధ నుంచి తల్లిదండ్రులు తేరుకునేలోగా గత కొంత కాలంగా చిన్న కుమారుడు వర్షిత్ అదే విధంగా అనారోగ్యం పాలయ్యాడు. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా, పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని కంచికామకోటి చిల్డ్రన్స్ ట్రస్ట్ వైద్యశాలలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు లివర్ సంబంధిత వ్యాధి ఉందని గుర్తించారు. ఈ వైద్యం అందించే పరికరాలు, నిపుణులు ఇక్కడ లేరని మరో వైద్యశాలకు తీసుకెళ్లాలని వారు సూచించారు. దీంతో చెన్నైలోని మరో వైద్యశాల (రేలా హాస్పిటల్)ను ఆశ్రయించగా వైద్యం కోసం సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని తేల్చిచెప్పారు. రెక్కాడితేగానీ డొక్కాడని తమకు ఇంత పెద్ద మొత్తం ఖర్చుపెట్టే శక్తి ఎక్కడ ఉందని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇదే వ్యాధితో ఒక బిడ్డను పోగొట్టుకున్నామని కనీసం.. ఈ చిన్నారి అయినా మాకు దక్కేలా దాతలు ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. సాయం చేయదలచిన వారు మధు నంబర్ 76600 11897కు సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలో వసతులు కల్పిస్తాం



తహసీల్దార్, ఎంపీడీఓకు సమస్యలు తెలియజేస్తున్న కాలనీ వాసులు

మనుబోలు: జగనన్న కాలనీలో మెరుగైన వసతులను కల్పిస్తామని తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. మనుబోలు పోలీస్‌స్టేషన్ వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీని శనివారం వారు పరిశీలించారు. కాలనీలో వసతులు సక్రమంగా లేవని, మెరుగైన సౌకర్యాలను కల్పించాలంటూ రెవెన్యూ కార్యాలయ ఎదుట కాలనీ వాసులు రెండు రోజుల క్రితం ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కాలనీకి వెళ్లి అక్కడి వారి స్థితిగతులను తహసీల్దార్, ఎంపీడీఓ పరిశీలించారు. కాలనీకి వెళ్లేందుకు గతంలో ఉన్న దారి ప్రైవేట్ స్థలం నుంచి ఉండటంతో ప్రస్తుతం దాన్ని మూసేశారని తెలిపారు. ప్రత్యామ్నాయంగా దారిని ఏర్పాటు చేయడంతో పాటు బోరును వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సర్వేయర్ శ్రీనివాసులు, జనసేన నేతలు ప్రసాద్, జకీర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



పూలమొక్క ఇస్తున్న వీరి చలపతిరావు



ప్రసన్నతో గొల్లపల్లి విజయ్‌కుమార్

కోవూరు : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

మనుబోలు: అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ కోరారు. మనుబోలులోని అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రాలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డే కార్యక్రమంలో భాగంగా తల్లులకు శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు లభించే వసతులు, పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను తెలియజేశారు. మూడు నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీలు లక్ష్మమ్మ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- పది రోజులుగా ఇదే దుస్థితి
- ఊసపల్లి వాసుల అగచాట్లు



ఊసపల్లిలో ఆటో వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

పొదలకూరు: వేసవి రాకముందే తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని ఊసపల్లిలో మంచినీటి కోసం ప్రజలు పది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలోని నీటిని సేవించి కిడ్నీల వ్యాధి బారినపడి గతంలో 20 వరకు మరణాలు సంభవించాయి. దీంతో దగ్గర్లోని కండలేరు సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి ఊసపల్లికు తాగునీటిని సరఫరా చేస్తుండటంతో వ్యాధి అదుపులోకి వచ్చింది. సీపీడబ్ల్యూఎస్ నుంచి ఊసపల్లితో పాటు పులికల్లు, వెంకటాపురం, అంకుపల్లి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పథకానికి సంబంధించిన పైప్‌లైన్ పది రోజుల క్రితం పగిలిపోవడంతో ఊసపల్లిలో తాగునీటికి కష్టాలు ఏర్పడ్డాయి. గ్రామంలోని బోర్ల నీటిని తాగేందుకు ఎవరూ సాహసించడం లేదు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దూరప్రాంతాలకు వెళ్లి క్యాన్లలో తాగునీటిని పట్టుకొస్తున్నారు. గ్రామానికి ట్యాంకర్‌ను పంపుతామని అధికారులు చెప్పారని, అయితే ఒకసారే ఇది వచ్చిందని చెప్పారు.

క్యాన్ మంచినీరు రూ.30

పొదలకూరు పట్టణం నుంచి ఊసపల్లి గ్రామానికి ఆటోలో తీసుకొచ్చే 20 లీటర్ల క్యాన్‌కు రూ.30 చెల్లించాల్సి వస్తోందని స్థానికులు వెల్లడిస్తున్నారు. గత పది రోజులుగా ఇదే విధంగా కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టి ఊసపల్లికి తాగునీటిని అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్యాంకర్‌ను ఏర్పాటు చేశాం

గ్రామానికి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశాం. అయితే ఇది వెళ్లలేదనే విషయం తెలియదు. వెంటనే చర్యలు చేపట్టి ట్యాంకర్‌ను పంపుతాం.

– రమేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్